# స్వప్నవాసం

డ్రీంలాండుకు సినిమాకని బయలుదేరాను. జనం కిటకిట లాడిపోతున్నారు. ఆనాడే పిక్చరు రిలీజు. అందులో జెర్రీలూయిది. టిక్కెట్టు దొరుకుతుందనే ఆశ పోయింది. తీరా ఇంతదూరంవచ్చి సినిమా చూడకండా తిరిగివెళ్ళటమనేది చాలా బాధాకరంగావుంది. ఇంక క్యూలోనిలబడినా నావరకు టిక్కెట్టువస్తుందనే నమ్మకం లేదు. ఆసలు క్యూలోనిలబడి టిక్కెట్టు తీసుకోవటమనేదే నాకుగిట్టదు. ఏమిటా ఉపాయమూ అని ఆలోచిస్తున్నాను. ఎటూ పాలుపోవటంలేదు. మెయిన్ గేటు దగ్గరగా నిలబడి వచ్చేపోయేవాళ్ళ మొహాలు చూస్తూ తికమక పడుతున్నాను. ఎంతసేపటికి ఎరుగున్న మొహము ఒక్కటి కనిపించదే! అట్లాగే తీక్షణంగా చూస్తున్నాను. కళ్లు దభాలున చెదిరినాయి. కళ్లు నిలబెట్టి తేరిపార చూస్తున్నాను. ఆ వ్యక్తి దగ్గరకొస్తున్నకొద్దీ పోలికలు ఒక్కొక్కటే స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక్క క్షణంలో భయమేసింది. అటూ ఇటూ బిత్తరచూపులు చూశాను. ఎవరి గొడవలో వాళ్లున్నారు. చూస్తూ చూస్తుండగానే దగ్గరకు రానే వచ్చేసింది, ఆమె.

పసుపుపచ్చరంగు చీర కట్టుకుంది ఎర్రటి జాకెట్టు తొడుక్కుంది. మొహం తళ తళ మెరిసిపోయేటట్లు చెమికీ అద్దుకుంది. వయ్యారంగా చేతిసంచి ఊపుకుంటూ వచ్చి నిలబడింది. నాలుగు వైపులా ఒక్క

సారిగా కళ్లు పోనిచ్చింది. అమ్మో! ఇంతజనమా అని ఆశ్చర్య పడ్డట్లు కనిపించింది. బిత్తర చూపులు చూస్తోంది. నన్ను చూసిందా లేదా అని అనుమానపడుతూనే వున్నా. ఆమె నన్ను చూసినట్లు ఎక్కడా అజ కనిపించటంలేదు. ప్రక్కనవున్న మగవాడ్ని ఆమె చూడలేదనుకోవటంకూడా ఏమిటోగానేవుంది. చూసి కూడా మెదల కండా వూరుకుంది అనుకోవటం కంటె ఇది నయంగదా అని అను కుంటున్నాను. ఒకప్పుడు చూసినాకూడా తనే ముందరగా ఎందుకు పలకరించాలి అని ఉరుకోవచ్చును కూడా. ఇందులో తప్పేముంది! మనం పలకరించటంలో నామోషీ ఏముంది అనుకున్నాను. అసలు ఎట్లా ఆంతమందిలో ఒక ఆడదాన్ని పలకరించటం! ముందర ఏమనాలి? ఎట్లాప్రారంభం చెయ్యాలి! ఇంతకీ ఆమెతో నాకేంపనుంది! ఆ టిక్కెట్టు కాస్త తెప్పించుకోవటం! ఈ ఘన కార్యం కోసం నా అంతట నేను ముందరగా ఒక ఆడదాన్ని పలకరించటం! ఇంతకంటె ఏదైనా ఒక గొప్పపని సాధిస్తానంటే ఒక వేళ పలకరించినా అందం చందం! కాస్తంత టిక్కెట్టుకోసం! అబ్బ ఒళ్ళు జలదరిస్తోంది. అయితే ఏమైనా సరే నేను ఇవ్వాళ సినిమా చూసితీరాల్సిందే అనే పట్టుదలగా వుంది. ఎట్లాగుఅని సందిగ్ధావస్థలో వున్నాను. ఇట్లాగే ఇంకొంచెంసేపు ఆలో చిస్తూ వున్నానంటే, ఆమెకాస్త చటుక్కున బుకింగ్ ఆఫీసుదగ్గరకువెళ్లి నిలబడుతుంది. అక్కడికి నేను వెళ్లానంటే నలుగురు నవ్వేస్తారు.

ఎట్లాగైనా గుండె నిబ్బరంచేసుకున్నాను. ఏమయినాసరే పలక రించి తీరుతాను అను కున్నాను. వెనకాలే అడుగుల్లో అడుగు వేసు కుంటూ ఆమె చటుక్కున నిలిచిపోగానే నేను చప్పున ఆగిపోయాను. ఆమె ఏమన్నా కనిపెట్టిందో ఏమిటో తనవెనకాల ఎవరో వస్తున్నట్లు, కొంచెం వెనక్కు మళ్లింది. నాగుండె ఝల్లుమన్నట్లయింది. నా

వైపు ఓరకంటితో చూసినట్లు అనుమానంకూడా తగిలింది. అయినా నేనేమి లెక్క పెట్టలేదు. నా కార్యసాధనకోసం నేను చూస్తున్నాను.

'సిస్టర్' అన్నాను నెమ్మదిగా. వినిపించు కున్నట్లులేదు. సిస్టర్ అని ఇంకొంచెం దగ్గరగా అన్నాను. నావైపుకు చూసి చిరునవ్వు నవ్వింది. నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది.

చాలా రష్‌గావుంది. నాకుకూడా ఒక టిక్కెట్టు.... అంటూ డబ్బు ఇవ్వబోయాను.

నావైపు అదోవిధంగా చూసి నవ్వింది. నాకేంచెయ్యాలో తోచక నేనూ నవ్వాను. ఆక్షణంలో ఆమె మొహంలో అదోరకపు మార్పు కనిపించింది. బహుశా నేను అంత చొరవగా, కాస్తంత పరిచయం తోనే, టిక్కెట్టు తెమ్మన్నానని ఏమన్నా అనుకుందో ఏమో! ఏమైనాగాని మాట జారాగా! ఇక అనుమానం ఎందుకు. నాకుకూడా ఒక టిక్కెట్టు తీసుకురండి అంటూ బాగా చనువుగానే అన్నాను. అయితే ఒక్క క్షణంలో నేను అనుకున్న నర్సేనా అనే అనుమానం తగలక మానలేదు.

వరసగా వారంరోజులపాటు నిలోఫర్ హాస్పటల్‌కు వెళుతూ వచ్చేవాడిని. రోజూ ఆనర్సుతోనే ఆమాటా ఈమాటా మాట్లాడాలసి వచ్చేది. అబ్బ! ఎంత ఇదిగా వుండేది అనుకున్నారు. రాజ్యం ఇంకా నాలుగు రోజులు అక్కడేఉంటే బాగుండును! అప్పుడే ఇంటికి తీసుకురావలసి వచ్చినదే అని అనుకున్నానుకూడా. అయితే ఆ డ్రస్సు వేరు, తెల్లటి పెద్ద గౌను, తెల్లటి జాకెట్టు, తెల్లటి టోపి, ఒక్క క్షణం తీరుబడి అయ్యేదికాదు. నాతో మాట్లాడుతున్నట్టే వుండేది. ఇట్టే ఎవరో పిలుస్తే వెళ్లివచ్చేది. మళ్ళీ ఏమిటండీ అనేది. ఒక మూల

ఎవరితోనన్నా మాట్లాడుతూవున్నా తన పని తాను చూసు కుంటూనే వుండేది. ప్రతివాళ్లు ఈ నర్సుంటేసరి ప్రాణం లేచివచ్చినట్లు నిట్టూర్పు విడిచేవాళ్లు. చొరవ చేసుకుని నేనూ అవీ ఇవీ మాట్లాడుతూ వుండే వాడిని. పాపం ఏమి అనుకునేది కాదేమో! ఇంతమంది స్త్రీలను తల్లు ల్ని చేసి ఇంటికి పంపిస్తూ వుంటుంది. తనకు కూడా అలాంటికోరిక వుండదా అనిపించేది. అనిపించటమేమిటి! ఒకసారి ధైర్యంచేసి అడిగేశాను కూడా. ఇతరుల సేవలో వుంటూవున్న మీకు మీవిషయం చూసుకోవటానికి టైముకూడా వుండదేమో అని. ఆమె నాభావం గ్రహించింది. అసలు ఆమె గ్రహించాలనేగా నేను అన్నదికూడా. నావంక అదోవిధంగా చూసి నవ్వింది. ఆ విషయాన్ని అంతటితో ఆపెయ్యటం మంచిదని ఇంకా పొడిగించలేదు. మొత్తంమీద ఆ ఆసు పత్రికి వెళ్ళిన వారంరోజులు కూడా ఆనర్సుతో నాకు సన్నిహిత సం బంధం ఏర్పడిందని అనుకున్నా అంటే. ఆమె నడకను నేను గుర్తిం చటం, నా రాకను ఆమె గమనించటం. మళ్ళీ నాకు ఆ ఆసుపత్రికి వెళ్లే అవసరమూ పడలేదు. నేను వెళ్ళనూలేదు. ఆ కాసేపు అట్లా అనిపించింది అంతే! ఆమెవరో! నేనెవరో! కాని ఎప్పుడైనా నేను ఒంటరిగాకూర్చుని ఆలోచించు కుంటుంటే మాత్రం ఆ నర్సు నా కళ్ళల్లోకి రాకమానదు, నేను కొంచెంగా కలవరపడకమానను.

అంత ఆప్యాయత ఆ నర్సుమీద వుంది. ఇవ్వాళిటిరోజున ఆమెగారు సినిమాకని ఒంటరిగావస్తే, నేను ఆమెచేత ఒక టిక్కెట్టు కూడా తెప్పించుకోలేని స్థితిలో వున్నానంటే నా చనువు చొరవ అంతా దండగన్నమాట!

ఒక్కక్షణం అసంతృప్తిపడి అట్లాగే ఆమె మొహంలోకి చూశాను. నన్నుచూసి మళ్లీ నవ్వింది. నేనూ నవ్వుతెచ్చుకున్నాను.

టిక్కెట్టు తెస్తానులెండి అన్నది చివరకు.

ఆ మాటకాస్త ఆమెచేత అనిపించటానికి ఎంత అవస్థపడవలసి వచ్చింది అనుకున్నాను. కొండెక్కినంత పనయింది. ఆమె చర చర నడవసాగింది. నాకు డబ్బివ్వటానికి కూడా వ్యవధి లేకపోయింది. బుకింగ్ ఆఫీసుదగ్గర నిలబడివున్న ఆమెదగ్గరకువెళ్లి డబ్బు ఇవ్వటం చాలా అసహ్యంగా కనబడింది. రెండు టిక్కెట్లు ఇట్టేపుచ్చుకుంది. కొంచెందూరాన వున్న నన్ను రెండుకళ్ళతో తేరిపార చూసింది. నేనూ ఆమెతోకూడా లోపలికివెళ్లి ప్రక్క ప్రక్కనే కూర్చున్నాను. మేమిద్ద రం అట్లా ప్రక్క ప్రక్కనే కూర్చుంటే చూసేవాళ్లు ఏమనుకుంటారా అనే ఆవేదన నన్ను పీడిస్తోంది కాని ఆమెగారుమాత్రం నిర్భయంగా మళ్లీ నావైపుకు చూసి నవ్వింది. నేను చటుక్కున డబ్బు ఇవ్వబో యాను. ఫర్వాలేదు ఉంచమన్నట్లు చెయ్యి చూపించింది. వెంటనే డబ్బు కాస్త జేబులో పెట్టేశాను. నాకేదో ధైర్యం వచ్చినట్లనిపించింది. అయినా ఆ అమ్మాయి డబ్బు నాకెందుకు అని మరుక్షణంలోనే మళ్లీ జేబులో చెయ్యి పెట్టాను వద్దని వారించినట్లు చెయ్యిచూపింది.

ఇంకా సినిమా మొదలు పెట్టటానికి ఎక్కువ వ్యవధిలేదు, నేను మీకు బాగా శ్రమయిచ్చాను.... అంటూ నీళ్లు నమలటం మొదలుపెట్టాను.

నవ్వి వూరుకుంది అంతే!

మీరు లేకపోతే నేను ఇవ్వాళ సినిమా చూసేవాడిని కాదు అన్నాను.

మళ్ళీ నవ్వి ఊరుకుంది.

ఊకదంపుడు సంభాషణకాకపోతే అనుకోకండా హఠాత్తుగా కనిపించిన పరిచితురాలైన ఆడపిల్లతో ఇదేనా సంభాషణ అని నాకే అనిపించి ఊరుకున్నాను.

సినిమా ప్రారంభమవటంతోనే ఒకమ్మాయిని ఒక మగవాడు గట్టిగా ముద్దుపెట్టుకున్న సీను ప్రత్యక్షమయింది. ఆ అమ్మాయి ఉండి ఉండి నవ్వుతోంది. నేను కూడా కొంచెం వినపడేలాగున అప్పటికే జేబు రుమాలు అడ్డంపెట్టుకునే నవ్వుకుంటున్నాను. ఒక్కసారిగా తలెత్తి నావైపుకు చూసింది. ఇట్టే చప్పబడిపోయాను. మళ్ళీ హుషారుగా నావైపుకుచూస్తే, నేనూ లేనినవ్వును తెచ్చుకుని నవ్వేసెయ్యటం. ఈ కోల్డ్ వార్ చూస్తుంటే నాకు చెడ్డ అసహ్యంవేసింది. నాకు ఫీలింగ్సు ఏమీ లేవన్నమాట. ఆ అమ్మాయి ఎట్లాఆడిస్తే అట్లా ఆడటమే అన్నమాట! అనిపించింది. కాస్త బింకంగానే ఉండిపోదాము అనిపించి, పెద్ద సీరియస్‌గా సినిమా చూస్తూ కూర్చున్నాను. అట్లా నన్ను కూర్చోనిస్తేగా ఒకపట్టాన. జెర్రీలూయి ఏదో వెకిలిచేష్టలు చెయ్యటం, ఈ అమ్మాయేమొ ఊగిపోవటము, ఆ నవ్వుకేనా అంతుండదు. అంత పొట్ట చెక్కలయ్యేటట్లు, ఆ అమ్మాయినవ్వుతూ హాలంతాకూడా దద్దరిల్లిపోతుంటే, నేను ఒక్కడినీ నవ్వకండా కూర్చుంటే, నాకు హ్యూమర్ తెలీదనుకుంటారు. పైగా ఇంగ్లీషు అర్థంకాలేదంటారు. ఈ అప్రతిష్ఠ నేను పడటమెందుకని నవ్వటమేగాని, అసలు నేను బింకంగానే వుండిపోదామనుకున్నా.

ఇంటర్‌వెల్‌లో ఆ అమ్మాయి సీటుగా లేచి దబదబ వాకిటిలో వెళ్ళింది. వెళ్లేటప్పుడు కనీసం నన్ను రమ్మనన్నా అనవచ్చుగా ఏమీ లేదు! నాకు ఆమెతో ఏమీ సంబంధం లేదు అని అవతలవాళ్లు అనుకునేటట్టు చేసిపోయింది. అసలు నిజం ఆలోచిస్తే, ఏ సంబంధం లేదను

కోండి! అయినా ఈ కాసేపు కొంచెం పరిచయస్థురాలులాగ వుంటోం దిగా! నేను మెదలకండా కూర్చోవలసిందే నిజానికి! అయితే ఆ అమ్మాయిని నిలవదీసి అడిగినా ఈ మాత్రం నీకు కర్టెసీ లేకపోయిందని, సారీ! పోనీ మీరు రాలేకపోయారా అని అంటుందనికూడా నాకు గట్టి నమ్మకం. ఈ మాటలు ఆమెచేత అనిపించటం నాకు ఇష్టంలేదు. అందువలనే నేనుకూడా చప్పున గేటుబైటికి వచ్చాను. అమాంతం ఒక డ్రింకు నాచేతికి అందిచ్చింది. తానొకటి పుచ్చుకుంది, నిజంగానే నేను అనుకున్నంతా జరిగిందనుకున్నా. మళ్లీ ఇద్దరం వచ్చి కూర్చు న్నాం, ఈ సారి కూర్చోవటంలో నా సీటులోవచ్చి ఆమె కూర్చుంది. నేను ఆమె సీటులో కూర్చోవలసివచ్చింది. నా ప్రక్కనే ఒక అమ్మాయి కూర్చునేవుంది. నన్నుచూసి మొహం చిట చిట లాడించింది. నాకూ అసహ్యంవేసింది. మీరు ఇక్కడ కూర్చోండి అనటానికి కూడా నాకేమిటోగా అనిపించింది. ఇంతలోకే కూర్చోండి అంటూ చెయ్యి చూపించింది. తప్పనిసరి అయింది. ఇక అటో స్త్రీ, ఇటో స్త్రీ, ఇద్దరూ ఒకటే పక పకలు, వెక వెకలు, జెర్రీలూయి కాస్తంత కళ్లు ఇటు త్రిప్పితేచాలు, పకాలున నవ్వు. ఇక ఆయన నవ్వు మొదలు పెట్టాడంటే కొడికూసినట్టే! ఇంకా వీళ్ళకు పట్టపగ్గాలుండవు. వీళ్లిద్దరి మధ్య నేను నలిగి పోయానంటే నమ్మండి! నేను మాత్రం అటూయిటూ వత్తిగిలటానికి వీల్లేదు. ఇటు వత్తిగిలితే ఈ అమ్మాయి అదోరకంగా, అటు వత్తిగిలితే ఆ అమ్మాయి అదోరకంగా చూస్తుంది. నేను కూర్చున్న కాసేపుకూడా నాకు సినిమా చూసినట్టే అనిపించలేదు. వీళ్ళిద్దరివాలకాలు చూడటంతోనే సరిపోయింది. నేను ఎన్నో అనుకున్నాను. నర్సుతో ఏవేమొ మాట్లాడాలనుకున్నాను. ఒక్కటి కుదర్లేదు. ఇంతకీ ఆమె కనిపించటం వలన సినిమా చూడటం సాధ్యమైనదేకాని ఇంకో ప్రయో జనం ఏమీ పొందలేక పోయాను.

నా ప్రక్కనే నర్సు మామూలు డ్రస్సులో కూర్చుని వున్నా కూడా, ఆ ఆసుపత్రిలో నర్సు రూపమే నాకు జ్ఞాపకంవస్తుంది. వాళ్ళ జీవితం అంతా ఆ ఆసుపత్రేకదా! ఇంకా బైట ప్రపంచతో సంబంధము ఏమీ లేదుగదా! అందులో ఆ రూపంలో ఆ నర్సును చూస్తుంటే, ఆమె జీవితాన్ని, ఆమె యౌవనాన్ని, ఆమె అందాన్ని ఆమె సరిగ్గా వినియోగించుకొనేలాగున చెయ్యవలసిన బాధ్యత నాకు కూడా వుందని బాధ పడేవాడిని. ఆమెను చూస్తుంటే విపరీతమైన జాలివేసేది. నా అమాయకపు ప్రేమకు అర్థంలేదనుకోండి! ప్రక్కన నర్సును పెట్టుకుని ఎప్పటివో గతించిన స్మృతులతో బాధపడటం ఎందుకు ?

సినిమా అయిపోయేంతవరకు నాకు ఈ రకపు ఆలోచనలే వెంటబడ్డాయి. అందరూ బైటకు వచ్చేస్తున్నారు. ఇంతరష్‌లో ఎట్లా వెళ్ళటమా అని నేనే ఒక్కక్షణం ఆలోచిస్తుంటే ఆమె తారాచువ్వలాగ దూసుకు పోతోంది, జనం మధ్యనుంచి. నేను కూడా ఆ దారేపట్టాను. గేటుబైటికి వచ్చేశాము, క్షణంలో జనం పల్చనయి పోతున్నారు. మోటారుసైకిళ్ళ చప్పుళ్ళతో చెవులు దిబ్బలు కట్టిపోయినాయి. అప్పటికే ఆరు అవుతోంది. శీతాకాలమేమొ చీకటిపడుతోంది. చలేస్తోంది. ఆదుర్దాగా ఎవరిళ్ళకు వాళ్ళు చేరిపోతున్నారు. నేను అట్లాగే నిలబడిపోయాను. ఆమె కదలదు. మెదలదు. మాట్లాడదు. నాకేమిటో అనిపిస్తోంది. నిజంగా ఆమెను చూస్తుంటే నాకు పూర్తిగా జాలివేసింది. ఆమె ఏమాత్రం సహాయంకోరినా, నేను ఆదుకుని తీరుతాను. మిగతా విషయాలు ఏమీ ఆలోచించను. ఏది ఏమైనాసరే! ఇది నా నిశ్చయమన్న మాట. దీనికి తిరుగులేదు.

దిగాలుపడి నిలబడింది. కాలి బొటన వేలుతో నేలను ఏదో విచారంగా గీస్తోంది. పాపం! అనుకున్నాను. ఆమె నిజంగా తన

దుఃఖంలోంచి సంతోషం పొందటానికి ప్రయత్నంచేస్తూ వుండాలి. తన అశాంతిని మరుగు పరుచుకోవటానికిని సినిమాకు బయలుదేరి వుండాలి. తాను ఎంత బాధపడుతోంది పాపం! అయినా ఆడది నోరు విప్పి ఎట్లా చెప్పగలుగుతుంది! మన బాధ్యతలు మనం నిర్వర్తించక ఇంకొకరినంటే ఏం ప్రయోజనమని, నేనే స్వయంగా, ఏమిటి ఆలోచిస్తున్నావు అని తెగబడి అడిగాను.

వంచిన తల ఎత్తనుకూడా ఎత్తలేదు. అసలు తననుకాదనుకున్నట్లు, అట్లాగే నేలను గీస్తూ నిలబడింది.

సిస్టర్!.... సిస్టర్! అంటూ పెద్ద నిట్టూర్పు విడిచాను.

మా ఇద్దర్నీ ఎవరో గమనిస్తున్నట్లు అలికిడి వినిపించింది. ఇక అక్కడ బాగుండ దనుకున్నాను. ఆవరణ దాటేదాక పట్టు బలవంతాన నడిపించాను. నాతో మళ్లీ అక్కడ నిలబడి అదేపని మొదలు పెట్టింది. నాకు చెడ్డ దుఃఖం వస్తోంది. ఎంతో జాలివేస్తోంది. కాని ఆమె నోటి వెంబడి ఒకమాటా రాదే!

నేను నిన్ను నిలోఫర్ ఆసుపత్రిలో చూసి నప్పటినుంచి........ అంటూ ఉపోద్ఘాతం ప్రారంభించాను.

చప్పున నా మొహంవైపుకు తిరిగి రెండడుగులు ముందుకు వేసింది. నా వళ్లు జలదరించింది.

నీ బాధ నేను గ్రహించాను అన్నాను ఎంతో నీరసించిపోయి. నా వైపు భయంగా చూసింది. నాకూ భయమేసింది.

సిస్టర్ !.... క్లయిమాక్సులోకి వస్తున్నానన్నమాట.

న్యాయానికి రోజులుకావు. మనం నిజముగా సహాయం చేద్దామనే తాపత్రియంలో పడిపోయాము. ఆ అమ్మాయి దుర్భర వేదన చూస్తూ, ఏ మగాడు సహించి ఊరుకుంటాడు? అందులో నేనసలు సహించలేను. ఈ ఒంటరిగావున్న అమ్మాయిని దుండగీళ్ళు, రౌడీలు, ఈ రాత్రి సమయంలో ఏమాటన్నా, నా కెంత బాధ! తానెక్కడికి వెళుతుందో చెప్పదు. అంతరంగికంగా నాతో మాట్లాడకపోతే పోయింది! ఆ సమయము వచ్చినప్పుడు ఆ అమ్మాయే వస్తుంది! పోనీ తనని తన తల్లి తండ్రులకు అప్పచెప్పే బాధ్యతేనా నాకు అంటగట్టదు. ఆ అమ్మాయి రెండడుగులువేస్తే, నేనూ ముందుకు సాగంగానే చప్పున ఆగిపోతుంది. ఎందుకని అట్లా బిత్తరపోతున్నదో నాకు తెలీదు. ఇద్దరం కలసి నడుస్తున్నాం. నేనేమిటో తెలీక ఒళ్ళు తెలియని అవస్థలో అంటున్నాను. ఆమె నా మాటలు వింటోందో లేదో నా కవుతే తెలీదు. యాంత్రికంగా అడుగులు వేస్తోంది. వచ్చి వచ్చి, నాలుగురోడ్ల కూడలి దగ్గర నిలబడి పోయినాము. నాకు చెడ్డ కోపంవచ్చి, టికెట్టు డబ్బు ఇవ్వబోయాను, ఆమె పుచ్చుకోలేదు. ఇట్టే చటుక్కున రిక్షాలోఎక్కి కూర్చుని నన్ను చూపి నవ్వుతూ చెయ్యి వూపింది. నేనుకూడా చేతి రుమాలను గాద్దు, జెండా తిప్పినట్లు తిప్పాను. అప్పటికి నేను పూర్తిగా అలసిపోయాను. ఇక ఆలోచించే శక్తిలేదు. ఒకడుగు ముందుకువేసే తాహతులేదు. ఓ రిక్షాలో ఇంటికివచ్చి పడ్డాను.

ఆ రాత్రంతా నా మనస్సులో విపరీతమైన కలవరం బయలుదేరింది. ఎంతసేపటికి నా తెలివితక్కువకు నేనే నిందించుకుంటున్నాను. చేతికి చిక్కిన యువతిని ధైర్యంచాలక వదిలేసి, దద్దమ్మలా

ఇంటికి వచ్చేశానన్నమాట. అంతేగా మనంచేసిన పని. నేనేమి అన్యాయంగా ఆలోచించలేదు. అక్రమంగా ఆమెను బజారుపాలు చెయ్యదలుచుకోలేదు. నా మనస్సులోని కోరికను కనీసం ఆమెకు చెప్పన్నావుండాల్సింది! నాకు ఆ ధైర్యం లేకపోవటమేమిటి నిజంగా! ఇవే ఆలోచనలు. ఆమెకు కూడా నేనంటే ప్రేమే! దీంట్లో సందేహంలేదు. కాకపోతే నాకు టిక్కెట్టు కొనియిస్తుందా! ఇదొక పెద్ద తార్కాణమన్నమాట! ఈసారి ఎక్కడైనా కనిపించటం తటసిస్తే, విషయం పూర్తిగా తేల్చుకోవాలి. అసలు ఆ అమ్మాయెక్కడుంటుందో గాలించేసెయ్యాలి. ఇట్లా అనుకుంటూనే వున్నాను. భళ్లున తెల్లారింది.

ఆనాడు ఇంట్లోంచి కదలనేలేదు. మనసు పరి పరి విధాల పోతోంది. మాటి మాటికి రాత్రి సంఘటనే జ్ఞాపకంవచ్చి కలవరపరిచేస్తోంది. రాత్రల్లా నిద్ర లేకపోవటంవలనో ఏమో పగలంతా నిద్ర పట్టింది. సాయంత్రం షుమారు అయిదు గంటలయింది. అందులో ఆదివారం. కాసేపు పబ్లిక్ గార్డెన్‌లోకి వెళ్ళి కూర్చుందామని బయలుదేరాను. అక్కడా విపరీతమైన జనం. అట్లాగే జనాన్ని నెట్టుకుంటూ, పిల్లలు ఏనుగుమీద ఎక్కుతుంటే చూస్తూ నిలబడ్డా. క్షణంలో కళ్లు చెదిరిపోయినాయి. కళ్లు నులుపుకుని మళ్ళీ చూశాను. ఒళ్లు ఝల్లుమంది. మళ్ళీ కళ్లు ఆర్పుతూ చూశాను. గుండె గతుక్కుమంది. కళ్లు నిలబెట్టి చూశాను శరీరం వణికిపోయింది. అక్కడ ఒక్క క్షణం నిలువలేకపోయాను.

ఆ నర్సు, నిలోఫర్‌లో చూసిన నర్సు. క్రిందటి రాత్రి సినిమా టిక్కెట్టు కొనిచ్చిన అమ్మాయి, రెండేళ్ళ పిల్లాడిని ఎత్తుకుని సీటుగా ఇటువైపుకే వస్తోంది. ప్రక్కన సూటు బూటు వేసుకుని ఒక యువకుడు

చలాకీగా నడుస్తున్నాడు. నిజంగా నర్సే! ఎవరోకాదు ఆ అమ్మాయే చూస్తూ చూస్తుండగానే దగ్గరకు వచ్చేస్తున్నారు. చటుక్కున ఆ అమ్మాయి ఆగిపోయింది. నా వైపుకు చూసింది. నేను హడలిపోయాను.

'ఇదిగో ఈయనే రాత్రి సినిమాకు వెళ్ళినప్పుడు....' ఈ మాటలే నాకు ఆమె నోటివెంబడి వినబడ్డాయి. నేను ఎంత పరుగెత్తినా ఆమె చూపుడువేలు నన్ను వెంటాడుతున్నట్టే అనిపిస్తోంది. ఆ యువకుని భీకరాకారం నా కళ్ళల్లోంచి పోవటంలేదు. అమాంతం ఏం చేశేవాడో నేను అక్కడేకనక వున్నట్లయితే అని తలుచుకున్నప్పుడల్లా నా గుండె ఝల్లుమంటుంది.

అప్పటినుంచీ నేను ఏ యువతీమీద కూడా జాలిపడనూలేదు. ఏమిటి అట్లా ఉన్నారు. అని ఏ యువతీకూడా నన్ను అడగనూలేదు.

( తెలుగు స్వతంత్ర, 9–7–1960 )